మొరవలెత్తిన చెరువులు



ప్రవహిస్తున్న నక్కపల్లి చెరువుకింద వంక



సదుం: మొరవపోతున్న కొర్లగుంటవారిపల్లె ప్రాజెక్టు

- ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- వైఎస్సార్ జలాశయంలోకి చేరుతున్న నీరు

పలమనేరు: పలమనేరు ప్రాంతంలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు చెరువులు మొరవ పారుతున్నాయి. వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయి. కర్ణాటక రాష్ట్రంతో ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు కౌండిన్య నదిలోకి నీరు చేరుతోంది. ఇప్పటికే మండలంలోని కాలువపల్లి వద్ద వైఎస్సార్ జలాశయంలోకి కౌండిన్య ద్వారా వరద నీరు చేరుతోంది. ఇది పూర్తిగా నిండి ప్రవహిస్తే పలమనేరు పట్టణానికి తాగునీటి సమస్య తీరుతుందని స్థానికులు చెబుతున్నారు. మండలంలోని బొమ్మిదొడ్డి, నక్కపల్లి, బేలుపల్లి, ఎస్‌పురంలోని వడ్డెవానికుంట, గొల్లపల్లి బుచ్చిరెడ్డి కుంట, ఎర్రగొండేపల్లి, గంగారపూర్ చిన్నచెరువు నిండిపోయి మొరవ పారుతున్నాయి. కొలమాసనపల్లి, మొరం, కరిడిమొడుగు తదితర చెరువులకు వరదనీరు చేరుతోంది. ఇక మండలంలోని బూదాలవంక, చిన్నేరు, ఎరిగినేరు, కాలువపల్లి వాగులు సాగుతున్నాయి.




మొరవెత్తుతున్న నక్కపల్లి చెరువు, నిండుకుండలా మారిన నక్కపల్లి చెరువు

నీట మునిగిన పంటలు

పలమనేరు మండలంలోని నక్కపల్లి చెరువు మొరవపారుతుండడంతో చిన్నేరు ప్రవహిస్తోంది. ఈ ఏరు పక్కన సాగు చేసిన వరి పంట నీట మునిగింది. నక్కపల్లి కీలేరిలో సైతం వరదనీరు భారీగా చేరింది.

నిండిన కొర్లగుంటవారిపల్లె ప్రాజెక్టు

సదుం: మండలంలోని కొర్లకుంటవారిపల్లె ప్రాజెక్టు సోమవారం ఉదయం నుంచి మొరవ పోతోంది. సదుంతో పాటు సోమల మండలంలోని అటవీప్రాంతంలో కొద్ది రోజులుగా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో వాగులు, వంకల నీరు గార్గేయ నది ద్వారా ప్రాజెక్టులోకి చేరుతోంది. ప్రాజెక్టు నిర్మించి 12 సంవత్సరాలు అవుతుండగా ఇప్పటి వరకు 11 సార్లు పూర్తి స్థాయిలో నిండిందని గ్రామస్తులు తెలిపారు. ప్రాజెక్టుకు మొరవ పోతుండడంతో పలు చెరువులకు నీరు చేరే అవకా శం ఉందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.





గొల్లపల్లి వద్ద ప్రవహిస్తున్న బూదాల వంక, నక్కపల్లి చెరువుకింద నీట మునిగిన వరిపంట



మొరవ పారుతున్న నక్కపల్లి చెరువు

క్లుప్తంగా

సమాచార హక్కు చట్టం ఒక ఆయుధం

పులిచెర్ల(కల్లూరు): సమాచార చట్టం ప్రతి ఒక్కరికీ ఒక ఆయుధంలాంటిదని మండల వ్యవసాయ శాఖాధికారిణి లీలాకుమారి తెలిపారు. ఆమె సోమవారం మంగళంపేట రైతు సేవా కేంద్రంలో సమాచార హక్కు చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, అభివృద్ధి పనుల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. వాటి అమలు తదితరాలను సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకుని అవినీతి జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా వుందన్నారు.

ఘనంగా గంగ పూజలు



గుడివంక పశ్చిమ వాహినిలో గంగ పూజ చేస్తున్న వేదపండితులు

గుడుపల్లె: గుడివంక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం గంగపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు, వేద పండితులు ఆలయం నుంచి కలశాలు తీసుకుని పశ్చిమ వాహిని చేరుకున్నారు. అక్కడ స్నానాలు ఆచరించి కలశాలల్లో నీటిని తీసుకుని తిరిగి స్వామి వారి ఆలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ భక్తిశ్రద్ధలతో స్వామికి పూజలు చేశారు. అనంతరం ఆలయ ఉగ్రానంలో కలశాలను స్థాపించి హోమం చేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల నిరసన



పలమనేరు: రాష్ట్రంలోని అన్ని శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు బదిలీలు చేపట్టి తమను విస్మరించడం తగదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు వాపోయారు. వారు సోమవారం బదిలీలు చేపట్టాలని కోరుతూ నిరసన తెలిపారు. జీసీటీఏ జిల్లా అధ్యక్షుడు వాసు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖల ఉద్యోగుల బదిలీలు చేపడుతోందని తెలిపారు. జీవో నంబర్ 42ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అధ్యాపకులు నందీశ్వరయ్య, జయశంకర్, శశికళ, బెనీజర్, వెంకటేష్ పాల్గొన్నారు.

బుటకపల్లెలో సామూహిక అక్షరాభ్యాసం



పిల్లలతో అక్షరాభ్యాసం చేయిస్తున్న అర్చకులు

చౌడేపల్లె: మండలంలోని బుటకపల్లె ప్రాథమిక పాఠశాలలో సోమవారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్ఎం శంకర ఆధ్వర్యంలో అర్చకులు ఆనందాచార్యులు సరస్వతీ పూజ చేశారు. అనంతరం పిల్లలతో అక్షరాలు దిద్దించారు. విద్యార్థులకు విద్య విశిష్టతను వివరించారు.

శివాలయ హుండీ ఆదాయం రూ.2.56 లక్షలు



హుండీలోని కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

పలమనేరు: పట్టణంలోని శివాలయంలో వున్న హుండీలోని కానుకల ద్వారా రూ.2,56,947 ఆదాయం వచ్చినట్టు ఈవో కమలాకర్ తెలిపారు. ఐదు నెలలకు సంబంధించి భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించినట్టు వెల్లడించారు. మదనపల్లి టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఆలయ అర్చకులు, పట్టణ పెద్దలు పాల్గొన్నారు.

భూములకు పరిహారం ఇవ్వాలని వినతి

రొంపిచెర్ల: మండలంలోని గానుగచింత గ్రామ పంచాయతీ సరిహద్దులో నిర్మించిన చల్లంపల్లె ప్రాజెక్టు ముంపు భూములకు నష్ట పరిహారం మంజూరు చేయాలని రైతులు కోరారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం పులిచెర్లలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. రైతులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రొంపిచెర్ల–ఎర్రావారిపాళెం మండలాల సరిహద్దులో 2004లో రూ.7.62 కోట్లతో చల్లంపల్లె ప్రాజెక్టు నిర్మించారని తెలిపారు. ఇందులో 170 మంది రైతులకు చెందిన 210 ఎకరాల భూమి ముంపునకు గురైందని తెలిపారు. పరిహారం కోసం అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారని తెలిపారు. ఈ క్రమంలో పరిహారం తక్కువగా ఇస్తుండడంతో మూడేళ్ల క్రితం అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి సమస్యను విన్నవించినట్టు పేర్కొన్నారు. ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారం నగదు పెంచేలా చేశారని తెలిపారు. ఎన్నికల కోడ్ రావడంతో నిధులు విడుదల కాలేదని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని పరిహారం ఇవ్వాలని కోరారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతి



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పులిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024–25లో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు స్థానిక హెచ్‌పీ పెట్రోల్ బంక్ యజమాని డి.వసంతమ్మ ప్రోత్సాహక బహుమతి ఇవ్వడానికి ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా పి.రమ్యకు (560 మార్కులు) మొదటి బహుమతిగా రూ.5 వేలు, ఆర్.రక్షిత (539 మార్కులు)కు రెండో బహుమతిగా రూ.3 వేలు, రెడ్డి శ్రావణి (534 మార్కులు)కి మూడో బహుమతిగా రూ.2వేలు ఇచ్చారు. వారికి చెక్కులను కలెక్టర్ సుమిత్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో రవికుమార్, జిల్లా ఎస్ఎస్ఏ ఏపీసీ వెంకటరమణ, తహసీల్దారు జయసింహ, ఎంఈవో సిద్ధరామయ్య, హెచ్ఎం లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

వి.కోట: మండలంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటలు దెబ్బతినకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి అప్పోజి తెలిపారు. ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరు పొలంలో నిల్వ ఉండకుండా కాలువలు తీసుకోవాలని సూచించారు. మొక్కజొన్న తోటలో రెండు రోజులకు మించి నీరు నిల్వ ఉండకుండా చూడాలని పేర్కొన్నారు. కోత దశలో ఉన్న పైర్లు నేల వాలకుండా 4–5 పైర్లను ఒక్కటిగా కట్ట కట్టాలని వెల్లడించారు. పూర్తిగా కోతకు సిద్ధంగా ఉన్న వరి, రాగి తదితర పంటల్లో మొలకలు రాకుండా ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని తెలిపారు. అధిక వర్షాలకు పంటలకు నష్టం వాటిల్లితే రైతు భరోసా కేంద్రం సిబ్బందికి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తాం

కుప్పం రూరల్: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తామని కుప్పం మున్సిపాలిటీ నూతన అధ్యక్షుడు హఫీజ్, ఉపాధ్యక్షుడు ఆర్.మునిరాజు, మోహన్‌రామ్ తెలిపారు. చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో సోమవారం కుప్పం మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా హఫీజ్, ఉపాధ్యక్షులుగా ఆర్. మునిరాజు, మోహన్‌రామ్, యువత అధ్యక్షుడిగా నవీన్ బాధ్యతలు స్వీకరించారు. హఫీజ్, ఆర్.మునిరాజు, మోహన్‌రామ్ మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ భరత్ తమపై నమ్మకంతో పదవులు ఇచ్చారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుని కుప్పం పట్టణంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. రాబోవు ఎన్నికల్లో కుప్పంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఎమ్మెల్సీ భరత్ నూతన కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీపురం మణి, రాజ్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరించిన వారిని అభినందిస్తున్న ఎమ్మెల్సీ భరత్

శ్రీకృష్ణాష్టమి వేడుకలకు ఎమ్మెల్సీకి ఆహ్వానం

కుప్పం రూరల్: కుప్పం పట్టణం, ప్యాలెస్ కాంపౌండ్ ఆవరణలో ఈ నెల 16 నుంచి 21 వరకు త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ భరత్‌ను సోమవారం ఆ సంస్థ సభ్యులు ఆహ్వానించారు. సేవా సమితి కుప్పం అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ 16 నుంచి 21 వరకు నిత్యం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తామని తెలిపారు. చివరి రోజు 21న పట్టణంలో స్వామి వారి విగ్రహ ప్రతిమ ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు.



ఎమ్మెల్సీ భరత్‌ను ఆహ్వానిస్తున్న సేవా సమితి కుప్పం అధ్యక్షుడు కృష్ణ

గ్రీవెన్స్ డేకు 186 అర్జీలు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్



పరిహారం ఇప్పించాలని కోరుతున్న మిట్టమీదపల్లె గ్రామస్తులు

పులిచెర్ల(కల్లూరు): మండల కేంద్రమైన పులిచెర్లలో సోమవారం పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలకు సంబంధించి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు మండలాలకు సంబంధించి 186 అర్జీలు వచ్చాయన్నారు. వాటిలో ఎక్కువగా రెవెన్యూకు సంబంధించినవేనని వెల్లడించారు. వీటిని పరిశీలించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వీటిపై నెల రోజుల తర్వాత సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. నిర్లక్ష్యం వహించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది పారదర్శంగా పనిచేయాలని, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో శ్మశానవాటికలకు సరిహద్దులు ఏర్పాటు చేయలన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టరు విద్యాధరి, ట్రైనీ కలెక్టరు నరేంద్రపడాల్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం ఇప్పించాలని వినతి

కొన్ని నెలలుగా ఏనుగులు పంట పొలాలపై పడి నాశనం చేస్తున్నాయని, పరిహారం ఇప్పించాలని పులిచెర్ల మండలంలోని మిట్టమీదరాచపల్లె, దళితవాడ, దేవళంపేట రైతులు భాస్కర్, నారాయణ, సిద్ధయ్య కోరారు. వారు గ్రీవెన్స్ డేలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ నష్ట పరిహారం అందేలా చూడాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు.

ఎస్ఐఆర్‌తో ప్రజాస్వామ్యానికి ప్రమాదం

పలమనేరు: ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ వల్ల ప్రజాసామ్యం ప్రమాదంలో పడుతుందని సీపీఎం కార్యదర్శి గిరిధర్ తెలిపారు. ఆయన సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి స్థానిక పార్టీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ విధానాన్ని దేశమంతా బీజేపీ గెలవడమే లక్ష్యంగా ఎన్నికల సంఘం పనిచేస్తోందని ఆరోపించారు. రామయ్య, గంగప్ప, జయంతి, ధనమ్మ పాల్గొన్నారు.

నులి పురుగులను నిర్మూలిద్దాం

పుంగనూరు: పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేసి నులి పురుగులను నివారిద్దామని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం అర్బన్, ముడిబాపనపల్లె పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు రంజిత, సృజన, తేజశ్రీతో కలిసి నులిపురుగుల నివారణ దినోత్సవ పోస్టర్లు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మంగళవారం అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లోని విద్యార్థుల కు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. ఎంపీహెచ్‌ఈవోలు మురళీబాబు, హరిప్రసాద్‌రెడ్డి, సూపర్‌వైజర్లు సరస్వతి, రత్నమ్మ, ఆనంద పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

బైరెడ్డిపల్లె: గర్భిణులు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌చంద్ర తెలిపారు. ఆస్పత్రి ఆవరణలో సోమవారం మహతి ఫౌండేషన్ ప్రతినిధులు గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు ప్రతి నెలా వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు శ్రేయస్కరమన్నారు. మహతి ఫౌండేషన్ అధ్యక్షుడు నాగరాజు, హెల్త్‌ఎడ్యుకేటర్ సావిత్రమ్మ పాల్గొన్నారు.

తిమ్మానాయనపల్లెలో కేంద్ర బృందం పర్యటన



పనులను పరిశీలిస్తున్న అధికారులు

సదుం: మండలంలోని తిమ్మానాయనపల్లెలో సోమవారం కేంద్ర బృందం సభ్యులు మణికన్నన్, ప్రశాంత్ కుమార్ పర్యటించారు. ఉపాధి, వెలుగు, ఐసీడీఎస్, పింఛన్లు, హౌసింగ్ తదితర పథకాల అమలును పరిశీలించారు. ఫారంపాండ్లు, పశువుల షెడ్ల నిర్మాణం, మామిడి మొక్కల పెంపకం, సీసీ రోడ్ల ఏర్పాటును తనిఖీ చేశారు. అర్హులకు పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏపీడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజలను వంచించడం చంద్రబాబు నైజం

సదుం: అలవిగాని హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజమని వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని చీకలచేను, బూరగమందలో సోమవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అరాచక పాలనను కొనసాగిస్తోందన్నారు. హామీల గురించి ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు పెట్టి వేధించడమే పనిగా పెట్టుకుందని దుయ్యబట్టారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. మళ్లీ ఆయన పాలన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని స్పష్టం చేశారు. సదుంలో నిర్వహించిన సమావేశంలో జెడ్పీటీసీ సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి మండలంలో రూ.వందల కోట్లతో అభివృద్ధి పనులు చేశారని గుర్తు చేశారు. అనంతరం క్యూఆర్ కోడ్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధనుంజయ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి, సర్పంచులు ఉషారాణి, వెంకటరమణ, జగన్నాథం, ఎంపీటీసీ మల్లికార్జున, నాయకులు బాబురెడ్డి, పుత్రాజు, ఇమ్రాన్, మనోజ్, చిన్న రమణ, మస్తాన్, కాలేషా, వాసు, రమేష్, బాషా, రాజశేఖర్, ధనశేఖర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, గణేష్ రెడ్డి, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి

అధికారం కోసమే అలవిగాని హామీలు



కందూరులో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

చౌడేపల్లె: అధికారం కోసమే చంద్రబాబునాయుడు ఎన్నికల్లో అలవిగాని హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను నిలువునా మోసం చేస్తున్నారని ఎంపీపీ ఈశ్వరయ్య, వైస్ ఎంపీపీ ప్రభాకర్, ఏఎంసీ మాజీ చైర్మన్లు నాగేశ్వరరావు, మోహన్ ఆరోపించారు. వారు సోమవారం నెల్లిమంద, వల్లిగట్ల, తమ్మినాయునిపల్లె, కామిరెడ్డిగారిపల్లె, కందూరు పంచాయతీల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాలతోపాటు 143 హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర పూర్తయినా వాటిని అమలుచేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. వలంటీర్లకు గౌరవ వేతనం రూ.10 వేలు ఇస్తామని చెప్పి ఉద్యోగాలే లేకుండా ఊడగొట్టారని విమర్శించారు. కూటమినేతల అక్రమాలు, అవినీతిని ప్రజలకు వివరించడమే బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు గ్రామ కమిటీల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించాలని సూచించారు. అనంతరం క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, బీసీ సెల్ పుంగనూరు నియోజకవర్గ అధ్యక్షుడు లక్ష్మీపతి, యూత్ ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, నాయకులు పగడాల శివకుమార్, శ్రీకాంత్, మల్లికార్జున రెడ్డి, మెకానిక్ బాషా, తిమ్మయ్య, బాలాజీ, రాజారెడ్డి, సాంబయ్య, నాగరాజ, బాలసుబ్రమణ్యం, భాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్ల విక్రయాలపై కఠిన చర్యలు

పుంగనూరు: ప్లాస్టిక్ కవర్ల విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం తమ సిబ్బందితో కలిసి పట్టణంలోని పలు దుకాణాల్లో దాడులు చేశారు. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు విక్రయిస్తున్న వారికి జరిమానాలు విధించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తే షాపులను సీజ్ చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మునివెంకటప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

మెకానిక్‌లపై దాడి.. పోలీసులకు ఫిర్యాదు

పలమనేరు: టూవీలర్ మెకానిక్కులపై ఆటోమొబైల్ యజమాని దాడి చేయడంపై పట్టణానికి చెందిన మెకానిక్కులు సోమవారం స్థానిక సీఐ నరసింహరాజుకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ పట్టణానికి చెందిన ఆటోమొబైల్ యజమాని అహ్మద్ తదితరులు మెకానిక్కులైన భూషన్, షౌకత్ తదితరులపై దాడి చేశారని తెలిపారు. ఆటోమొబైల్స్ వారు వస్తువులను మాత్రమే విక్రయించాలని, మెకానిక్కులను పెట్టుకుని మరమ్మతులు చేయించరాదని, మెకానిక్కులు ఆటో మొబైల్స్ విక్రయించరాదని ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. ఇందుకు విరుద్ధంగా ఆటోమొబైల్స్ వ్యాపారులు మరమ్మతులు చేయిస్తుండగా మెకానిక్కులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆగ్రహం చెందిన అహ్మద్, అతని అనుచరులు కలిసి మెకానిక్కులపై దాడి చేశారని తెలిపారు. పోలీసులు విచారిస్తున్నారు.

కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించండి

పుంగనూరు: హామీలు అమలుచేయకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అమరనాథరెడ్డి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆయన సోమవారం ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, పీకేఎం ఉడా మాజీ చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, బోయకొండ మాజీ చైర్మన్ నాగరాజారెడ్డి, జిల్లా యూత్ వింగ్ కార్యదర్శి కొత్తపల్లె చెంగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రాజశేఖర్‌రెడ్డితో కలిసి ఆరడిగుంట, సింగిరిగుంట, మేలుందొడ్డి, మాగాండ్లపల్లె , వనమలదిన్నె పంచాయతీల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. అమరనాథరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో హామీలు ఇవ్వడం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను మోసం చేయడం చంద్రబాబునాయుడు నైజమన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు రాజారెడ్డి, మునస్వామి, ఆంజప్ప, శంకరప్ప, ఎంపీటీసీలు నంజుండప్ప, సూరప్ప, జయరామిరెడ్డి, కృష్ణమూర్తి, కృష్ణారెడ్డి, గురివిరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మెలుందొడ్డిలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు